క్లుప్తంగా

నేడు పెదముషిడివాడలో 'గడప గడపకు..'

పరవాడ: మండలంలోని పెదముషిడివాడలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటారని చెప్పారు. వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోన రామారావు కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఘనంగా పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

కనుల పండువగా అప్పన్న కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రజా రక్షణ భేరి యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాణిక్యం

పరవాడ: విజయవాడలో ఈ నెల 15న నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి పి.మాణిక్యం పిలుపునిచ్చారు. తాడి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, మెరుగైన సమాజం, ప్రజా రక్షణ కోసం ఈ యాత్రను తలపెట్టారన్నారు. కాలుష్యంతో సతమతమవుతున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సీపీఎం కృషి చేయాలని స్థానిక మహిళలు కోరారు. ఎస్.వెంకటలక్ష్మి, జి.లక్ష్మి, పి.సత్యవతి, ఎం.వరహాలమ్మ, కె.ఈశ్వరమ్మ, ఎం.సూర్యకళ, కె.త్రివేణి, జి.అమ్మాజి పాల్గొన్నారు.

నాకవుట్‌కు సీనియర్ వుమెన్ జట్టు



విశాఖ స్పోర్ట్స్: బీసీసీఐ సీనియర్ వుమెన్ క్రికెట్ నాకవుట్‌కు ఆంధ్ర జట్టు అర్హత సాధించింది. టీ20 ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆంధ్ర మహిళా జట్టు ఐదింట విజయాలు సాధించింది. నవంబర్ మూడో తేదీనుంచి నాకవుట్ పోటీలు ప్రారంభం కానుండగా తొలి మ్యాచ్‌లో ముంబయ్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా జట్టును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- అడివివరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

విద్య, వైద్యం రెండు కళ్లుగా పాలన సాగిస్తోన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల చెంతకే వైద్యసేవలను తీసుకెళ్లారు. అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నారు. వ్యాధుల తీవ్రతను అనుసరించి మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి వైద్యానికి సిఫారసు చేస్తున్నారు. దీంతో పేదలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ పట్ల కనబరుస్తున్న శ్రద్ధ, ఆప్యాయతలను వేనోళ్ల కొనియాడుతున్నారు.



పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



పురుషోత్తపురంలో మందులు అందిస్తున్న ముమ్మన దేముడు



అడివివరం ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అడివివరం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో రోగులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

సింహాచలం : ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడివివరంలోని 530 సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సచివాలయాల పరిధిలో జరిగే ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేడు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని ఎంతగానో మెచ్చుకుంటున్నారని, దేశవ్యాప్తంగా మంచి పేరు వచ్చిందన్నారు. స్పెషలిస్ట్ వైద్యుల కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉంటుందని, కానీ నేడు అటువంటి వైద్యులే మన చెంతకు వచ్చి సేవలందిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఆయన పాలనలో విద్య, వైద్య రంగానిలకు సువర్ణ యుగమన్నారు. సామాన్యుడు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని, పేదవాళ్లకు స్పెషలిస్ట్ వైద్యం అందాలని ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి లక్షలాది మందికి ప్రాణదానం చేశారన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 3,200 రకాల రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. వెయ్యి రూపాయలకు పైబడిన ప్రతి కేసును ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. వెయ్యి నుంచి అటు తర్వాత ఎంతైనా ఉచితంగా ట్రీట్‌మెంట్ అందిస్తున్నారన్నారు. దేశంలోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి కూడా జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో తీవ్రమైన రుగ్మతలతో ఉన్నవారికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. ఎలాంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారన్నారు. ఈ సందర్భంగా స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ జాహెద్, డాక్టర్ అభీష తదితరులను దుశ్శాలువాలతో సత్కరించారు. కాగా మొత్తం 479 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉత్తమ వైద్య సేవల కోసం ఆరోగ్యశ్రీకి ఎనిమిది మందిని రిఫర్ చేశారు. జీవీఎంసీ 8వ జోన్ ఏపీడీ శ్రీరామ్, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, కర్రి స్వామి, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, తెడ్లపు మహేష్, దొంతల సంతోష్, టి.రాము, శిడగం తాతబాబు, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో..

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం 502 సచివాలయం ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శివగాయత్రినగర్, ఆర్టీసీ లేఅవుట్, మరిడిమాంబ కాలనీ ప్రాంతాల నుంచి దాదాపు 180 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దేవిశ్రీ, నాయకులు సింహాచలం, దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, నాయకులు జొన్నాడ సాయికృష్ణ, బుజ్జి, విజయేంద్ర కృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్ తదితరులు



పటేల్, ఇందిరాగాంధీ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, అధ్యాపకులు

పెందుర్తి : సర్దార్ వల్లబాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం పెందుర్తి యూనిక్ పబ్లిక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా పెందుర్తి కూడలి వరకు ర్యాలీ నిర్వహించి జాతీయ ఐక్యత, భద్రతా నినాదాలు చేశారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్, పాఠశాల కరస్పాండెంట్ నాని, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారతరత్న, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమంతోపాటు దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో వల్లబాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ లెక్కల గణేష్, ఎన్‌సీసీ విభాగం కో ఆర్డినేటర్ ఇంద్రసేన, కెమిస్ట్రీ అధ్యాపకుడు వి.వి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయంలో పారాయణ పఠనం

అగనంపూడి: అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు విజయనగరంలోని పైడిమాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం లలిత, విష్ణు సహస్ర నామాలు పారాయణం చేశారు. పైడితల్లి సిరిమానోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో 50 మంది పారాయణ బృంద ప్రతినిధులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పోలినాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన ముత్యాలనాయుడు తదితరులు

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం. పోలినాయుడును ఆయన కార్యాలయంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, అంతకాపల్లి ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడదాం



'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెందుర్తి: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని పార్టీ కేడర్ పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని జీవీఎంసీ జోన్-8 జేసీఎస్ కన్వీనర్ మనాలత జోబ్‌దాస్(చిన్ని), వైఎస్సార్‌సీపీ 88వ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు పిలుపునిచ్చారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ వినూత్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలన్నారు. 88వ వార్డు నరవలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు మంగళవారం వార్డులోని సచివాలయాల కన్వీనర్లు, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర కార్యక్రమంతో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని చెప్పారు. నాడు టీడీపీ హయంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకుతింటే.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు నేరుగా మేలు చేసేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిందన్న మంచి ఆశయాలను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయ కన్వీనర్లతోపాటు ముఖ్య నాయకులు ఈ కార్యక్రమాన్ని చురుగ్గా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ముందుగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో సచివాలయాల కన్వీనర్లు వి.దుర్గ నాగలక్ష్మి, ఎస్.గురుమూర్తి, సర్వసిద్ధి బోరయ్య, నారపిన్ని అప్పలరాజు, పి.చంద్ర, వి.గణేష్, పి.లక్ష్మణరావు, ఎం.శేషు, పి.ప్రవీణ్, ఎం.జగదీష్, ఎ.సత్య అప్పారావు, ఎం.అప్పారావు, మళ్ల నూక అప్పారావు, చిడగం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ జీవితం స్ఫూర్తిదాయకం



బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



విశాఖ ఇన్‌స్టిట్యూట్‌లో వ్యాసరచన పోటీల విజేలతో కళాశాల సిబ్బంది

గోపాలపట్నం: నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్.కామేష్ కుమార్, కె.కామేశ్వరరావు, అధ్యాపకులు వంశీకృష్ణ, లిఖిత, సుజాత, కిరణ్ బేడీ పాల్గొన్నారు.

- నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రేష్మ ప్రతిభ



విద్యార్థిని రేష్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్ తదితరులు

సబ్బవరం: జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎస్.రేష్మ ప్రతిభ చూపింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రా జట్టు తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించింది. గోవా జట్టుతో జరిగిన తుది పోరులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓటమి చెంది ద్వితీయస్థానంలో నిలిచింది. తుది పోరులో రేష్మ ప్రతిభ చూపి, కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిందని ప్రిన్సిపాల్ పి.మురళీధర్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.వి. రమణారావు, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థిని రేష్మను అభినందించారు.

దుర్గమాంబ పీఏసీఎస్ సేవలు అభినందనీయం



సబ్బవరం దుర్గమాంబ పీఏసీఎస్ సిబ్బందితో సహకార సంఘాల అభివృద్ధి సెల్ సభ్యులు



పీఏసీఎస్ కార్యకలాపాలను వివరిస్తున్న కార్యదర్శి రమణ

సబ్బవరం: శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జిల్లాకే ఆదర్శనీయమని విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ అన్నారు. సహకార సంఘాల డెవలప్‌మెంట్ సెల్ సభ్యులతో కలిసి ఆయన సబ్బవరం పీఏసీఎస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ రైతులకు అందిస్తున్న సేవలను కార్యదర్శి గొంప రమణ వివరించారు. రూ. 4 కోట్ల నుంచి రూ.14 కోట్ల టర్నోవర్‌కు సహకార సంఘం ఏ విధంగా చేరుకున్నదీ వివరించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందిస్తున్న పంట రుణాలు, బంగారు అభరణాలపై రుణాలు, భూ తనఖా రుణాలు, కార్యాలయం ఆవరణంలో నిర్మించిన వాణిజ్య సముదాయం, సినిమా థియేటర్ల నుంచి వస్తున్న అద్దె, లాకర్ సదుపాయం, జేఎల్‌జీ (జాయింట్ లయబిలిటీ గ్రూపు లు) నిర్వహణ ద్వారా రూ.2 లక్షల ఆదాయం నుంచి రూ.15 లక్షల ఆదాయానికి ఏ విదంగా చేరుకున్నదీ వివరించారు. సీఈవో మాట్లాడుతూ జిల్లాలోనే సబ్బవరం పీఏసీఎస్ లాభదాయకంగా నడుస్తుందని సిబ్బందిని అభినందించారు.

సభ్యులందరికీ అన్ని రకాల రుణ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. డిపాజిట్ల సేకరణ, బంగారు నగలపై రుణా లు తదితర అంశాల అమలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకు డీజీఎం శ్రీనివాస్, ఆఫ్కాబ్ పీడీఎస్ఎల్ మేనేజర్ శ్రీరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, డైరెక్టర్ మంజు, కార్యదర్శి గొంప రమణ, సిబ్బంది జి. దేముడుబాబు, రామకృష్ణ, కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో డీఎస్ఎల్ఎల్‌యూ విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి కోలోసస్-2023 పతకాలు సాధించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్ హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ (హెచ్ఎల్ఎల్‌యు)లో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించిన వార్షికో క్రీడాంశాల్లో పలు ఈవెంట్లలో పాల్గొని పతకాలు సాధించినట్లు వర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ డి. సూర్యప్రకాశరావు మంగళవారం తెలిపారు. వాలీబాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ఇ-స్పోర్ట్స్, చెస్, క్యారమ్స్, సోలో డ్యాన్స్, సోలో పాటల పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో అశుతోష్ వర్మ, శివాంక్ భలేరావ్, వి. వైశాక్, ఫ్రాన్సిస్ పీఎస్, మిన్హజ్ నజీర్, శరత్ సింగ్, మాన్సీసింగ్, ప్రయాగ్‌లతో కూడిన జట్టు ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. ఫిఫా-23లో శివాంక్ భలేరావు బంగారు పతకాన్ని సాధించారన్నారు. మాన్సీసింగ్ 1500 మీటర్ల రేసులో స్వర్ణం సాధించారన్నారు. శోభన్‌రెడ్డి లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబరిచి జట్టుకు రజత పతకాన్ని అందించారన్నారు. 100 మీటర్ల రిలే రేసులో శరద్‌సింగ్, అశుతోష్ బెహరా, శోభన్ రెడ్డి, డి. ఆకాష్‌ల బృందం కాంస్య పతకాలు సాధించిందన్నారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. సూర్యప్రకాశరావు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జోగినాయుడు, స్పోర్ట్స్ ఫ్యాకల్టీ కన్వీనర్ భరత్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఓఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖపట్నం ఎంఎస్ఎంఈ - డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఐలా, వాసీవా, డీఐసీ సంయుక్తంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 4.0ను నిర్వహించాయి. మంగళవారం ఆటోనగర్ వాసీవా భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతిల ప్రాముఖ్యతను పురస్కరించుకుని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ 2020లో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ప్రారంభించిందని చెప్పారు. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రజల్లో నడక, పరుగు అలవాటును పెంపొందించడమే ఈ రన్ లక్ష్యం అన్నారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నాల్గవ ఎడిషన్ ఈ సంవత్సరం స్వచ్ఛ భారత్, స్వాస్థ్య భారత్ థీమ్‌తో ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌గా అక్టోబర్ 1 నుంచి 31 వరకు నిర్వహించినట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.ఎ.ఎ.వి.ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎన్. కుమార్, వీరయ్య, రేవతి, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కోళ్లి ఈశ్వరరావు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, డీఐసీ జీఎం సీహెచ్ గణపతి, ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, వాసీవా ప్రతినిధులు రాంప్రసాద్, పర్చూరు ప్రభాకర్, అనార్‌బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి చెకుముఖి సంబరాలు

మధురవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె. పరశురామ్ తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.